# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 8-5-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 247 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## విశాఖ ఘటనపై ప్రధాని ఆరా

### సిఎం జగన్‌కు ఫోన్

న్యూఢిల్లీ,మే7(ఆర్ఎన్ఎ): విశాఖపట్నం జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమలో జరిగిన గ్యాస్ లీక్ ఘటన ప్రతి ఒక్కరిని కలిచివేస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రధాని మోడీ ఉన్నతస్థాయి సమీక్ష జరిపారు. అలాగే సిఎం జగన్‌కు ఫోన్ చేసి పరిస్థితిపై ఆరా తీసారు. తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వైజాగ్ గ్యాస్ లీక్ ఘటన నన్ను షాక్‌కు గురిచేసిందని కాంగ్రెస్ నేత రాహుల్ అన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను బాధితులకు అవసరమైన సాయం అందేలా చూడాలని కోరుతున్నాయి. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానంటూ రాహుల్ గాంధీ తెలిపారు.

# విశాఖలో విషం చిమ్మిన ఎల్‌జి పాలిమర్స్







## విష వాయువు లీకతో పలువురు దుర్మరణం

**గ్యాస్ పీల్చడంతో వందలాది మందికి అస్వస్థత**
**నోరులేని పశువులకూ తప్పని మృత్యుఘోష**
**అస్వస్థులకు పలు ఆస్పత్రుల్లో చికిత్సలు**
**ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలింపు**
**రంగంలోకి దిగిన జిల్లా అధికార యంత్రాంగం**
**మంత్రి అవంతి, కలెక్టర్,ఎస్పీల పర్యవేక్షణ**
**ఘటనపై అధికారలుతో మాట్లాడిన సిఎం వైఎస్ జగన్**

విశాఖపట్నం,మే7(ఆర్ఎన్ఎ): విశాఖ జిల్లాలో విషవాయువు ప్రాణాలు తీసింది. కొందరి ప్రాణాలను హరించగా..మరికొందరిని మృత్యువేదికపై నిలబెట్టింది. ఊపిరాడక మరికొందరు తల్లడిల్లుతున్నారు. తెల్లవారక ముందే వేకువ జామున జరిగిన ఘటన కావడంతో ప్రజలు తెలుసుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మనుషులతో పాటు, పశువులు కూడా మృత్యువాత పడ్డారు. విశాఖలోని గోపాలపట్నం పరిధిలోని ఆర్ఆర్ వెంకటాపురంలోని ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమలో భారీ ప్రమాదం చోటుచేసుకోవడంతో గ్యాస్ లీకయ్యింది. గ్యాస్ పీల్చిన ఘటనలో ఇప్పటి వరకు ఏడుగురు మృతి చెందారు. దాదాపు 200 మంది అస్వస్థతకు గురయ్యారు. అపస్మారకంలోకి వెళ్లిన వారిని కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారిలో ఇద్దరు వృద్ధులు, ఎనిమిదేళ్ల చిన్నారి కూడా ఉన్నారు. మరోవైపు విషవాయువు ప్రభావంతో వెంకటాపురంలో బావిలో పడి గంగరాజు అనే వ్యక్తి మృతిచెందగా, మేడపై నుంచి పడి మరోకరు ప్రాణాలు కోల్పోయారు. గురువారం తెల్లవారు జామున గంటల సమయంలో పరిశ్రమ నుంచి వెలువడిన రసాయన వాయువు దాదాపు 3 కిలోమీటర్ల మేర వ్యాపించింది. కాగా లీకైన రసాయన గాలి పీల్చడంతో అక్కడి స్థానిక ప్రజలు ఊపిరి తీసుకోవడానికి చాలా ఇబ్బంది పడ్డారు. దీంతో పాటు చర్మంపై దద్దుర్లు, కళ్లలో మంటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ నాయుడు తోట పరిసరాల్లో ఇల్లు ఖాళీ చేసి మేఘాద్రి గడ్డ డ్యామ్ వైపు పరుగులు తీశారు. కాగా రసాయన గాలి పీల్చడంతో కొంతమంది అస్వస్థతకు గురై అపస్మారకస్థితిలో రహదారిపైనే పడిపోయారు. కరోనా నేపథ్యంలో ఇప్పటివరకు లాక్‌డౌన్‌లో ఉన్న ఈ కంపెనీని తెరిపించే క్రమంలో తెల్లవారుజామున 4 గంటలకు ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కాగా పరిశ్రమ నుంచి స్టైరెన్ అనే విష వాయువు లీకైనట్లు తెలుస్తుంది. గ్యాస్ లీకేజీ ఘటనపై అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి సైరన్ మోగించి ప్రజలను అప్రమత్తం చేశారు. దీంతో పాటు గ్యాస్ లీకేజీపై పోలీసులకు సమాచారమందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని భయంతో తలుపులు వేసుకొని ఉండిపోయిన ప్రజలను ఇళ్లను ఖాళీ చేయాల్సిందిగా హెచ్చరించి వేరే చోటికి తరలించారు. ఈ ప్రమాదంలో తీవ్ర అస్వస్థతకు గురైన 15 మందిని అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్ ఆసుపత్రికి తరలించగా, మరికొందరిని వేర్వేరు ఆసుపత్రికి తరలించారు. అస్వస్థతకు గురైన వారిలో ఎక్కువగా చిన్నారులు, మహిళలు ఉన్నారు. మంత్రి అవంతి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌తో పాటు జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఆర్.కె.మీనా ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. కాగా ఎల్‌జి పాలిమర్స్‌లో రసాయన గ్యాస్ లీకైన ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్ వినయ్‌చంద్‌కు ఫోన్ చేసి

వివరాలు తెలుసుకున్నారు. తక్షణమే సహాయ కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. రసాయన వాయువు విడుదలైన బాధిత ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. విశాఖ జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్ మాట్లాడుతూ.. ఎల్‌జీ పరిశ్రమలో స్టైరెన్ అనే రసాయన వాయువు లీకైందన్నారు. ఈ రసాయన వాయువు పీల్చి పలువురు అస్వస్థతకు గురవ్వగా వారిని హుటాహుటిన కేజిహెచ్ సహా ఇతర ఆస్పత్రులకు తరలించామన్నారు. వైద్య సేవలందించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. మరో 48 గంటలపాటు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పరిస్థితి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

కాగా ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని మంత్రి అవంతి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా అవంతి మాట్లాడుతూ.. తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో ప్రమాదం జరిగిందన్నారు. అధికారులు అప్రమత్తమై వెంటనే సహాయకచర్యలు చేపట్టారు.. బాధితులకు అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు వాయువు పీల్చడంతో తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిన బాధితులకు చికిత్స అందిస్తున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ పేర్కొన్నారు. బాధితులకు చికిత్స అందించేందుకు ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అధిక సంఖ్యలోనే ఉన్నారన్నారు. కాగా తెల్లవారుజామున గ్యాస్ లీకేజీ కావడంతో ఎక్కువమంది అస్వస్థతకు గురయ్యారు. వాయువు లీకైన ప్రదేశాల నుంచి ప్రజల దూరంగా వెళితే బాగుంటుదని సూపరింటెండెంట్ వెల్లడించారు.











## విశాఖ ఘటనపై సిఎం కేసీఆర్ దిగ్భ్రాంతి

హైదరాబాద్,మే7(ఆర్ఎన్ఎ): విశాఖ గ్యాస్ లీకేజీ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమ నుంచి గ్యాస్ లీకేజీ కావడం దురదృష్టకరమని సీఎం అన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం కేసీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.

### దురదృష్ట ఘటన అంటూ విచారం
### బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష
### రాజకీయ,సినీ ప్రముఖుల విచారం

వైజాగ్ గ్యాస్ లీక్ ఘటన నన్ను షాక్‌కు గురిచేసింది. అక్కడి దృశ్యాలు తీవ్ర ఆవేదన కలిగించాయి. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గ్యాస్ లీక్ వల్ల అస్వస్థతకు లోనైనవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ఇది ఎంత దారుణమైన ఏడాదని కేటీఆర్ పేర్కొన్నారు. విశాఖలో విష వాయువు స్టైరెన్ బారినపడి ప్రజలు మరణించటం మనసుని కలచివేసింది. మరణించిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. అస్వస్థతకు గురైన వారందరు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని చిరంజీవి తెలిపారు. ఇలాంటి కష్ట సమయాల్లో విశాఖ గ్యాస్ లీక్ వార్త వినాల్సి రావడం గుండెను కలిచివేసింది. ఈ ప్రమాదంలో మరణించినవారికి సంతాపం తెలియ జేస్తున్నారు. బాధిత కుటుంబాలకు ధైర్యం ప్రసాదించాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నాను. వారి కోసం నేను ప్రార్థిస్తున్నాను. స్టే సేఫ్ వైజాగ్ అని మహేష్ బాబు అన్నారు. నా జీవితంలో ఎంతో ప్రత్యేకత కలిగిన ప్రదేశాల్లో ఒకటైన వైజాగ్‌ను ఈ స్థితిలో చూడటం నన్ను కలిచివేసింది. ఈ ఘోర ప్రమాదం నాకు చాలా బాధ కలిగించింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఈ ప్రమాదం అస్వస్థతకు లోనైనవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని అల్లు అర్జున్ అన్నారు. వైజాగ్‌లో గ్యాస్ లీక్ వార్త తీవ్రంగా కలిచివేసింది. ఈ ఏడాదిలో రోజురోజుకు పరిస్థితులు దారుణంగా మారుతున్నాయి. మీరు అందరు క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నానని రవితేజ పేర్కొన్నారు. మరో విషాదం మనల్ని తాకింది. విశాఖ ఘటనకు సంబంధించిన ఫొటోలు చూస్తుంటే చాలా బాధ కలుగుతోంది. అన్ని పరిశ్రమలో పున: ప్రారంభించే టప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నానని వరుణ్‌తేజ్ అన్నారు. వైజాగ్ గ్యాస్ లీక్ దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. బాధితులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాని నటి మంచు లక్ష్మి అన్నారు. 2020 ఎందుకింత కష్టంగా ఉంది. నిద్ర లేచిన వెంటనే గ్యాస్ లీకేజీ వార్త విన్నాను. బాధితులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని మంచు మనోజ్ అన్నారు. వైజాగ్ దుర్ఘటన దృశ్యాలు చూసి షాక్‌కు గురయ్యా. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. అస్వస్థకు గురైన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు అనిల్ రావిపూడి తెలిపారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ మంత్రమ్మాయ ప్రాయులనైనను
తన్మయులను జేయు శక్తి తగు బోధనిడన
మున్ముందుగ నేగాంచెద
సన్యాసిని "చిన్మయా" ఋషి- సౌజన్యానికి శిరస్!!

(మే 8 స్వామి చిన్మయానంద సరస్వతి జననం)



–రాధశ్రీ
సెల్: 9494481210

## విషవాయువు ఘటన దురదృష్టకరం

### విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద

విశాఖపట్నం,మే7(ఆర్ఎన్ఎ): విషవాయువు లీకైన ఘటన దురదృష్టకరమని విశాఖ శారదా పీఠాధిపతులు స్వామి స్వరూపానందేంద్ర అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనలోని బాధితులు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు. భగవంతుడి ఆశీస్సులతో పరిస్థితి సద్దుమణగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా విష వాయువు ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు విశాఖ శారదాపీఠం, వానప్రస్థం వృద్ధాశ్రమం చేయూత అందిస్తాయని తెలిపారు. పదివేల మందికి వానప్రస్థం వృద్ధాశ్రమంలో మధ్యాహ్న భోజనం అందించటం కోసం ఆహారం పంపిణీకి నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పారు. ఈ బాధ్యతలను శరద పీఠం ట్రస్టీ రొబ్బి శ్రీనివాస్‌కు అప్పగించినట్లు స్వామి స్వరూపానందేంద్ర తెలిపారు.

## విశాఖ గ్యాస్ లీకేజీపై సిఎం జగన్ దిగ్భ్రాంతి

### అధికారులతో సమీక్ష..విశాఖకు చేరిక

అమరావతి,మే7(ఆర్ఎన్ఎ): విశాఖ గ్యాస్ లీక్ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై అధికారులతో సీఎం వైఎస్ జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా డీజీపీ గౌతమ్ సవాంగ్, విశాఖ జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్‌తో సీఎం వైఎస్ జగన్ మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలు, ఇతర అంశాలపై సీఎం వైఎస్ జగన్ సమీక్షించారు.

ఘటన జరిగిన తర్వాత తీసుకున్న సహాయ చర్యలతోపాటు.. ఆస్పత్రుల్లో బాధితులకు అందుతున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్

అధికారులను ఆదేశించారు. విశాఖ గ్యాస్ లీక్ జరిగిన ప్రాంతానికి సీఎం వైఎస్ జగన్ విశాఖకు బయలుదేరి వెళ్ళారు. అక్కడ అందుతున్న సహాయక చర్యలను సీఎం వైఎస్ జగన్ దగ్గరుండి పర్యవేక్షించనున్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో సిఎం వెంట సిఎస్ నీలం సాహ్ని, ఇతర అధికారులు ఉన్నారు. గురువారం తెల్లవారు జామున ఆర్ఆర్ వెంకటాపురంలోని ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమలో రసాయన వాయువు లీకైంది. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందగా.. దాదాపు 200 మంది అస్వస్థతకు గురయ్యారు.

### యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం

విశాఖ గ్యాస్ లీక్ ప్రమాదానికి ఎల్‌జీ పాలిమర్స్ యాజమాన్య నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారణ అయింది. లాక్‌డౌన్‌లోనూ పరిశ్రమలో ప్రతిరోజు మెయింటెనెన్స్ చేయాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టుగా తెలుస్తోంది. లాక్‌డౌన్ ఉన్న కారణంగా మెయింటెనెన్స్ కోసం ప్రభుత్వం పాస్‌లు కూడా ఇచ్చింది. 45 మందికి మెయింటెనెన్స్ పాస్‌లు ఇచ్చినప్పటికీ.. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పరిశ్రమ ట్యాంకుల్లో దాదాపు 2 వేల మెట్రిక్ టన్నుల స్టైరెన్‌ను నిల్వ చేసింది. అక్కడ 20 డిగ్రీల లోపు ఉష్ణోగ్రత ఉంచడంలో ఫ్యాక్టరీ యాజమాన్యం విఫలమైంది. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో.. స్టైరెన్ లీక్ అయి మంటలు చెలరేగాయి. దీంతో ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాలకు స్టైరెన్ గ్యాస్ వేగంగా వ్యాప్తి చెందింది. కాగా, గురువారం తెల్లవారుజామన చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ఆరుగురు మృతిచెందగా, దాదాపు 200 మంది అస్వస్థతకు లోనయ్యారు.

